ప్రజాశక్తి

ఆదివారం 18 డిసెంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సిఐటియు మహాసభకు పరవాడ సిద్ధం

- నేడు సంతబయలు సెంటర్‌లో భారీ బహిరంగ సభ
- ముఖ్య అతిథులుగా సిహెచ్.నర్సింగరావు, బేబిరాణి
- అనకాపల్లి జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న కార్మికవర్గం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సిఐటియు అనకాపల్లి జిల్లా 12వ మహాసభలకు ఫార్మా కంపెనీల కేంద్రమైన పరవాడ ఆతిథ్యమిస్తోంది. కనీస వేతనాలు, కార్మిక హక్కులు అమలుకాని, కార్మికుల శ్రమను గుర్తించని, మనుషుల ప్రాణాలకు విలువివ్వని చోట ఆది, సోమవారాల్లో జరగనున్న ఈ మహాసభకు ఎంతో ప్రాధాన్యతవుంది.

ఫార్మా, సెజ్, ఇతర ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాట కార్యాచరణ ఇక్కడ రూపొందనుంది. వివిధ రంగాల కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మూడేళ్ల కాలంలో సిఐటియు చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు, లోపాలపై మహాసభ సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించి పోరాట కార్యక్రమాలకు తుదిరూపం ఇవ్వనుంది. పరవాడలోని కోటి వీరయ్యనగర్ (సీతారామ కల్యాణ మండపం)లో జరగనున్న ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి ఆయా పోరాటాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన 250 మంది ప్రతినిధులుగా హాజరుకానున్నారు.

ఆదివారం ఉదయం 10 గంటలకు పరవాడలోని సంతబయలు సెంటర్‌లో భారీ కార్మిక బహిరంగ సభ జరుగనుంది. తహశీల్దార్ కార్యాలయం నుంచి ఒక ర్యాలీ, సినిమా థియేటర్ నుంచి మరొక ర్యాలీ వేర్వేరుగా బయల్దేరి బహిరంగసభ వద్దకు చేరుకుంటాయి. ఈ బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి బేబిరాణి మాట్లాడనున్నారు. సభ అనంతరం కోటి వీరయ్యనగర్‌లో ప్రతినిధుల సభ ప్రారంభంకానుంది.

మహాసభలకు సిద్ధమైన కోటి వీరయ్య నగర్ ప్రాంగణం

సమస్యలపై బలమైన కార్మికోద్యమాలు : జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికాధిపతుల ఆర్థిక ప్రయోజనాల కోసం కార్మిక హక్కులపై ప్రభుత్వాల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ప్రతిఘటించేందుకు బలమైన కార్మిక ఉద్యమాలు నిర్మించేందుకు మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. మహాసభల సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

మహాసభ ప్రాధాన్యత ఏంటి ?

కార్మిక చట్టాలు, హక్కులపై మోడీ ప్రభుత్వం తీవ్రమైన మిగతా 2లో..

అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ రాజాబాబు

జగనన్న కాలనీ నిర్మాణ పనులు వేగవంతం

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జగనన్న కాలనీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆయన పరవాడ మండలం దేశపాత్రుని పాలెంలోని జగనన్న కాలనీ లే-అవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి, ఇళ్ళు కట్టించి ఇస్తోందన్నారు. దీనిలో భాగంగా దేశపాత్రునిపాలెంలో 194 ఎకరాలలో 5065 ప్లాట్లను అభివృద్ధి చేసి ఇళ్ళు నిర్మించేందుకు పనులు మొదలు పెట్టామని, మొదటి దశలో 1331 ఇళ్ళు నిర్మిస్తామని, ప్రాజెక్ట్ ఖరీదు రూ.7.98 కోట్లని, ఒక్కొక్క యూనిట్ 340 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాలో ఉందని తెలిపారు. జగనన్న ఇళ్లలో ఒక ఫ్యామిలీ నివాసం వుండే విధంగా బెడ్ రూము, హాలు, కిచెన్, బాత్రూం, వరండా ఉంటాయని తెలిపారు. పనుల నాణ్యతలో రాజీపడబోమన్నారు. కాంట్రాక్టర్‌కు కావలసిన మౌలిక వసతులైన ఫ్లడ్‌లైట్లు, మంచినీరు, నీటి సంపులు, వాచ్‌మెన్ గదిలాంటి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపు నాయుడు, డిసి (రెవెన్యూ) ఫణిరాం, జోనల్ కమిషనర్ సింహాచలం, ఎఎంఒహెచ్ డాక్టర్ కిరణ్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజినీరు ఆర్‌పి.రాజు పాల్గొన్నారు.

నిఫ్‌పాట్‌ను దూరంగా తరలించాలని ధర్నా

▶ వార్త మెయిన్‌లో..

47వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

▶ వార్త 5లో..

వడ్డాది వంతెన మరమ్మతు పనులు ప్రారంభం

▶ వార్త 6లో..

విశాఖలో జరిగిన శారద వర్థంతి సభలో మాట్లాడుతున్న డాక్టర పద్మ

చట్ట సభల్లో మహిళలకు..

33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- శారద వర్థంతి సభల్లో వక్తలు డిమాండ్

వార్తలు 8వ పేజీలో..

ఘనంగా ఎయు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యువతకు దిశా నిర్దేశం చేసిన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం - 6 శనివారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ సంస్థ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి హాజరై మాట్లాడారు. జాన్ కెనడీ చెప్పిన మాటలను గుర్తు చేశారు. మనకి దేశం ఏమిచ్చింది అనే దానికంటే మనం దేశానికి ఏమిచ్చాం అన్న మాటలు తనను ఎంతగానో ఆకర్షించాయని, ప్రతి ఒక్కరూ తాము ఉండే సమాజం పట్ల అవగాహన, బాధ్యత కలిగి ఉండాలని అన్నారు. దేశం పట్ల యువత ప్రేమను చూపాలన్నారు. సహచరులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తగిన ప్రణాళికలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. భారతదేశం సైన్స్, టెక్నాలజీ, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కుల, మత, ఆర్థిక విభేదాలను పక్కన పెట్టి సమిష్టిగా ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఎవరికైనా చేసే పనిలో రాణించడం ద్వారానే గుర్తింపు, గౌరవం వంటివి వస్తాయని తెలిపారు. జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ జిఎం.రావు మాట్లాడుతూ 2025లో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనుందని తెలిపారు. డిజిటల్ ఎకానమీలో భారతదేశం అమెరికా, చైనా తరువాత స్థానంలో మిగతా 2లో..

మాట్లాడుతున్న నారాయణమూర్తి

డ్రీమ్ వాల్‌ను తిలకిస్తున్న నారాయణమూర్తి, జిఎం.రావు తదితరులు

మొదటి పేజీ తరువాయి..

సమస్యలపై బలమైన కార్మికోద్యమాలు

దాడిచేస్తోంది. పారిశ్రామికాధిపతుల లబ్ధి కోసం కార్మిక హక్కులను కాలరాస్తోంది. దీంతో ఫార్మా, సెజ్, ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలుకావడంలేదు. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు వర్తింపజేయడంలేదు. అసంఘటితరంగ కార్మికులకు సమగ్రచట్టంలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రత లేదు. తరచూ జరుగుతున్న ప్రమాదాలతో కార్మికులు గాయపడుతున్నారు. మరణిస్తున్నారు. ఈ పరిస్థితులన్నింటిపైనా చర్చించి కార్మిక ప్రయోజనాలను దెబ్బతీసే విధానాల ప్రతిఘటనకు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం.

జీతాలు పెంచకపోవడానికి కారణమేంటి ?

ప్రభుత్వాలే కార్మికులకు జీతాలు పెంచకుండా యాజమాన్యాలకు సహకరిస్తున్నాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి కనీస వేతనాలను సవరించి, అమలు చేయాల్సిన ప్రభుత్వం పదేళ్ల నుంచి వేతన సవరణ చేయలేదు. దీంతో పదేళ్లకాలం నాటి జీతాలనే ఇప్పటికీ యాజమానులు చెల్లిస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగాలంటే ప్రభుత్వం వేతన సవరణ చేయాలి.

వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏం చేయబోతున్నారు ?

అతి తక్కువ వేతనాలకు, ఎక్కువ సమయం పనిచేయించుకొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి యాజమాన్యాలు కార్మికులను తెప్పించుకుంటున్నాయి. సిపిఎం నాయకత్వాన కేరళ వామపక్ష ప్రభుత్వం తరహాలో వలస కార్మికులను అతిథులుగా గుర్తించి అన్ని వసతులు కల్పించాలి. వలస కార్మికుల చట్టం అమలు జరిగేలా పోరాటాలు నిర్వహిస్తాం. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇచ్చేలా ఒత్తిడితేనున్నాం. విద్యార్హత కలిగిన స్థానిక యువతకు ఆయా పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇచ్చేలా జిఒ అమలుకు పోరాటాలు చేపడతాం.

దిగజారుతున్న అసంఘటితరంగ కార్మికుల జీవన పరిస్థితులు మెరుగునకు చేయబోయే కృషి ఏంటి ?

అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని పోరాటం నిర్వహిస్తాం. 60 ఏళ్లుపైబడిన వారందరికీ పెన్షన్ ఇవ్వాలి. ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలి. పనుల్లేని కాలంలో మూడు నెలలపాటు ప్రతినెలా ఐదు వేలు ఇవ్వాలి. ప్రయివేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, సెక్యూరిటీ గార్డులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో, లారీల్లో పనిచేస్తున్న కార్మికుల జీవన పరిస్థితులు మెరుగుపడాలంటే సమగ్ర చట్టం తేవాలి. దీనికి ప్రత్యేక పోరాట కార్యాచరణను మహాసభలో రూపొందిస్తాం.

ఘనంగా ఎయు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉందని తెలిపారు. విద్యార్థులు తగిన ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి యూనివర్సిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, నూతన ఆవిష్కరణలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఎయు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అవంతి ఫీడ్స్ లిమిటెడ్ ఛైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్, బివిఎన్.రావు, ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఆచార్య బీల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తొలగని చిక్కులు.. అయినా ప్రచారం..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ముమ్మాటికీ విశాఖే ఆంధ్రప్రదేశ్‌కు పరిపాలనా రాజధాని అన్న ప్రచారాన్ని అధికార వైసిపి పట్టుకుని వదలడం లేదు. న్యాయస్థానాల్లో చిక్కులు తొలగకపోయినా.. ప్రచారం మాత్రం ఆగడం లేదు. పైపెచ్చు మరింత బలంగా ఈ ప్రాంత ప్రజల్లోకి తీసుకెళ్లే పనిలో ఆ పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు. ఈ నెల 14న ఎండాడలో పనోరమా హిల్స్ వద్ద రెండు ఎకరాల స్థలంలో వైసిపి కార్యాలయానికి ఆ పార్టీ నేతలు భూమి పూజ చేపట్టారు. భవిష్యత్‌లో ఇదే రాష్ట్ర రాజధాని కార్యాలయం కానుందంటూ స్వయంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఛైర్మన్, వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి ప్రకటించారు. దీంతో విశాఖలోని ఆ పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం కనిపిస్తోంది. పైగా 60 రోజుల్లో మొదటి దశ పనులు పూర్తవుతాయని వెల్లడించారు. అయితే రాష్ట్ర పార్టీ కార్యాలయానికి అవసరమైన అన్ని హంగులూ సమకూర్చగలిగే రియల్ ఎస్టేట్ పెద్దలూ ఆ పార్టీలో ఇప్పుడు లేకపోలేదు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఓటర్లను తమవైపు తిప్పుకోడానికి ఆ పార్టీ వ్యూహాత్మకంగా విశాఖ రాజధాని అంశాన్ని చేపట్టింది. అయితే, అధికార పార్టీ అగ్రనేతలు 'అశ్వత్థామ హత : కుంజర' అన్నట్టు 'రాజధాని విశాఖకు వచ్చేస్తుంది' అని గట్టిగా.. 'న్యాయపరమైన చిక్కులు తొలిగిపోతేనే' అంటూ ధ్వని రాకుండా చెప్పడం తెలిసిందే.

రాజధాని ప్రచారంతో మేలుందా ?

అమరావతి నుంచి రియల్ ఎస్టేట్ బుడగ ఇటు వైపు దారిమళ్లించడం కూడా దీంట్లో భాగమే. ఇది కొంతమేర సక్సెస్ అయ్యిందనే చెప్పొచ్చు. అయితే రియల్ ఎస్టేట్‌తో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఒరిగేదేమిటి? ఎంత మాత్రం ఈ ప్రచారం వల్ల ఈ తరగతులకు మేలు జరగదన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.. కానీ ఈ వెనుకబడిన ఉత్తరాంధ్రకు రాజధాని తెచ్చి ఉపాధి అవకాశాలు పెంచుతామని, ఈ ఏడాది ఉగాది నుంచే విశాఖ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టనున్నారని రెండు ఉగాది ఉత్సవాల నుంచీ ఊరిస్తూనే ఉన్న విషయం తెలిసిందే. తాజాగా 2023 సంవత్సరం ఉగాదికి విశాఖ నుంచే జగన్ పాలన ప్రారంభిస్తారన్న ప్రచారం ఊపందుకుంటోంది.

ఆచరణలో ఏం జరుగుతోంది?

రుషికొండపై పచ్చదనం తీసేసి భారీ ఎత్తున నిర్మాణాలకు వైసిపి ప్రభుత్వం ఒడిగట్టిందన్న ప్రతిపక్షాల విమర్శల గురించి తెలిసిందే. రాష్ట్రంలో ఏ స్టూడియోను, భవంతులనైనా నేలపై కట్టారా? రామానాయుడు, రామోజీ స్టూడియోలు కొండలపై లేవా? అప్పుడు కొండలపై పచ్చదనం కనబడలేదా? అంటూ వైసిపి రివర్స్ విమర్శలూ తెలిసిందే. అంటే రుషికొండపై తమ పనిని సమర్థించుకునే స్థితికి వైసిపి పార్టీ వచ్చింది. ఇక్కడ ముఖ్యమంత్రి కార్యాలయ పనులకు సంబంధించిన భవనాల నిర్మాణాలే చురుకుగా సాగుతున్నాయి. అదానీ డేటా సెంటర్‌కు కాపులుప్పాడ కొండలపై గతంలో టిడిపి మంజూరు చేసిన స్థలాన్ని వైసిపి అధికారంలోకి వచ్చాక రద్దు చేసింది. వెనువెంటనే అదానీ కంపెనీతో ముఖ్యమంత్రి చర్చలు జరిపి అదే డేటా సెంటర్‌ను అదానీకి ఇక్కడ ఇచ్చేశారు. ఇక్కడ 40 వేల ఉద్యోగాలు రాబోతున్నాయంటూ వైసిపి పెద్దలు చెబుతున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి కావాల్సి ఉన్నా మోడీ విశాఖ వచ్చి వెళ్లినా బిజెపి నేతలు మెప్పించి ఒప్పించలేకపోయారు. అధికార వైసిపి కూడా చొరవ చేయలేదు. ఇదెప్పుడు మొదలవుతుందో చెప్పలేని స్థితి. విశాఖ రైల్వే జోన్ పనుల విషయంలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రతిష్టంభన తొలగే పరిస్థితులు కనిపించడం లేదు. కార్మికవర్గం పోరాట బాటను వీడేలాగ రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం కేంద్రంతో సంప్రదింపులు చేయడం లేదు. పై పెచ్చు ప్లాంట్ భూములపై వైసిపి కన్నేసింది. నాలుగు వేల ఎకరాల వరకూ పొందే దిశగా కేంద్రాన్ని ప్రసన్నం చేసుకునే పనిలో వైసిపి నిమగ్నమైంది.

మెట్రో రైలుకు అతీ గతి లేదు. స్వయంగా ముఖ్యమంత్రి జగన్ విశాఖలోని ఏయూ సభలో ప్రకటించిన హనుమంతవాక ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులకు శ్రీకారం జరగలేదు. నిధులూ ప్రభుత్వం ఇవ్వలేదు. ఏవీ జరగకుండా ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి భూమి పూజను హడావుడిగా చేపట్టారు. సిఎం క్యాంప్ కార్యాలయం అంటూ రుషికొండపై నిర్మాణాలతో ముందుకు సాగుతున్నారు.

విశాఖలో ఐటి రంగాన్ని అభివృద్ధి చేసి, రోడ్లకు, అవసరమైన చోట్ల వంతెనలకు ప్రాధాన్యత ఇచ్చి ఎంతో కొంత రూపురేఖలు మార్చి రాజధాని కబుర్లు ఎన్ని చెప్పినా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన పార్టీగా ప్రజలు గుర్తించేవారు. కానీ అధికార పార్టీ ఆ పనీ చేయలేదు.

ఉత్సాహంగా వైశాఖి కళంజియా సొసైటీ మహాసభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైశాఖి కళంజియా సొసైటీ 11వ మహాసభ శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అత్యంత ఉత్సాహంగా జరిగింది. మూడు వేల మంది సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ముందుగా వెలంపేట పోస్ట్ ఆఫీసు నుంచి స్టేడియం వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముందుగా సొసైటీ వార్షిక నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హత ఉన్నవారికి అందుతున్నాయన్నారు. ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ హేమలత, బ్యాంకు అఫ్ ఇండియా జోనల్ ఆఫీసర్ రాము, హార్బర్ రోడ్, కొత్త రోడ్ మేనేజర్లు వాసు, రామమూర్తి, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ధాన్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్ రమాప్రభ, రీజియన్ కో - ఆర్డినేటర్ శైలజ, సమాఖ్య కో - ఆర్డినేటర్ అప్పలరాజు, లీడర్స్ గౌరి, మునమ్మ, సిబ్బంది మంగవేణి, సన్యాసమ్మ, దేవి పాల్గొన్నారు.

పోర్టు ప్రయివేటీకరణపై 19న ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 19న మధ్యాహ్నం 12 గంటలకు పోర్టు ఎఒబి ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాలని విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు నిర్ణయించాయి. శనివారం ఎఐటియుసి ఆఫీసులో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం జరిగింది. మేజర్ పోర్టుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, షరతులు లేని వేతన ఒప్పందాన్ని వెంటనే చేయాలని, బోనస్ (పిఎల్ఆర్) బ్యాలెన్స్ చెల్లిస్తూ కొత్త ఫార్ములా రూపొందించాలని, నేషనల్ ఎసెట్స్ మోనిటైజేషన్ పైపులైన్‌ను ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటుపరం చేయరాదని, పోర్టు భూములు బిల్డింగులు, కల్యాణ మండపాలను ప్రయివేటువారికి కట్టబెట్టొద్దని అన్నారు. సమావేశంలో ఎఐటియుసి పోర్టు విభాగం ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్, అప్పారావు, బాబు, హెచ్ఎంఎస్ నాయకులు మంగయ్య, నాయుడు, సిఐటియు నాయకులు సిహెచ్.త్రినాథరావు, బి.లక్ష్మణరావు, బి.జగన్, జె.సత్యనారాయణ, ఐఎన్‌టియుసి నాయకులు చందు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జ్ఞానాపురంలోని శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం హుండీలను శనివారం లెక్కించారు. అక్టోబర్ 26 నుంచి డిసెంబర్ 17 వరకు 52 రోజులకుగాను హుండీల ద్వారా అమ్మవారికి రూ.15 లక్షలా 29 వేలా 566 ఆదాయం లభించింది. ఇఒ ఎస్.ప్రసన్న లక్ష్మి పర్యవేక్షకులుగా హాజరయ్యారు.

వైజాగ్ ఆటో ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సాగర తీరాన ఆటో ఎక్స్‌పో ఘనంగా ప్రారంభమైంది. శనివారం ఉదయం విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్ కె.రామ్మోహనరావు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సంయుక్తంగా ఈ ఆటో ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టు ఛైర్మన్ రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఏడాదీ సంవత్సరాంతపు సేల్స్‌లో భాగంగా ప్రత్యేక ఆఫర్లతో కొనుగోలుదారులకు డిస్కౌంట్ ఆఫర్లు ఇస్తూ ఆటోమొబైల్ రంగంలో అన్ని బ్రాండ్ల కార్లు, బైకుల కంపెనీలు ముందుకు రావడం కొనుగోలుదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సుమారు 20 కంపెనీలు తమ తమ కొత్త ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో ఉంచి అమ్మకాలు జరుపుతుండడం వాహన కొనుగోలుదారులకు మంచి అవకాశమని అన్నారు. అనంతరం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నయ్, కోల్‌కతా వంటి మహా నగరాల్లో జరిగే ఈ ఆటో ఎక్స్‌పోలు విశాఖలో కూడా జరగడం అభినందనీయమన్నారు. రేస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పదేళ్లుగా ఈ తరహా ఈవెంట్లను నిర్వహిస్తోందని తెలిపారు. శని, ఆదివారాల్లో సాగర్ తీరానికి వచ్చే వేలాది మంది ప్రజలు ఈ ఎక్స్‌పోను సందర్శించడం ద్వారా మంచి ఆఫర్లను సొంతం చేసుకోవచ్చన్నారు. తమ సొంత కారు కలను నెరవేర్చుకునేందుకు వీలుగా ఒకే చోట లేటెస్ట్ మోడల్స్ బ్రాండ్లు కార్లను ఇందులో ఉంచడం ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో నెరెడ్ కో రాష్ట్ర అధ్యక్షుడు నగేష్, ఎపి టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.విజయ్ మోహన్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, రేస్ ఈవెంట్ మేనేజర్ దాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనక మహాలక్ష్మి రథయాత్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, అధిక సంఖ్యలో భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. ఈ యాత్ర జగదాంబ అంబికా బాగ్ దేవాలయం నుంచి టౌన్ కొత్త రోడ్డులోని శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వరకు సాగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొల్లి సింహాచలం, ఇఒ శిరీషా, డిఇఇ వెంకటరమణ, ఎఇఒ రాంబాబు, ఆలయ పాలకవర్గ సభ్యులు బెహరా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫ్యాషన్ రంగంలో రాణించిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) జాయింట్ డైరెక్టర్ ఎల్.మధన్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలా మంది యువత ఫ్యాషన్ రంగంలో రాణిస్తున్నారని చెప్పారు. ఈ రంగంలో రూ.25 వేలు నుంచి 50 వేల జీతాలు లభించే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రంగంలో ఆసక్తి ఉన్న యువత తమ ఇనిస్టిట్యూట్‌లో చేరితే వారిని ఆ రంగంలో నిపుణులుగా తీర్చిదిద్ది, వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామన్నారు. క్యాంపస్ హెడ్ ప్రొఫెసర్ అన్నాజీ శర్మ మాట్లాడుతూ డిజైన్ స్ట్రీమ్, టెక్నాలజీ స్ట్రీమ్, మేనేజ్‌మెంట్ స్ట్రీమ్ కోర్సులలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. www.nift.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.78/2021

Between
MallaVenkataSatyanarayana ... Plaintiff
And
Chandramouli and 8 others ... Defendants

SUMMONS TO THE 2nd DEFENDANT

To,
Paramjyothi (Surname not known to the plaintiff), Son of not known to the plaintiff Hindu,C/o Sarada Public School, Chillapeta, Tagarapu valasa, Bheemunipatnam Mandalam, Visakhapatnam District.

Please take summons that the above Suit filed against you and the above Case. stands posted to **06-01-2023.** You are hereby summoned to appear either in person or through an Advocate in the above mentioned Honourable Court at **10.30 A.M.** on **06-01-2023** failing which the matter will be heard and decided in your absence.

(By Order of the Court)

V.SATYA NARAYANA SASTRY, M.A.B.L.,
ADVOCATE
Redman Plaza, 4th floor,
2nd Lane,Dwarakanagar,
Visakhapatnam-530016.
Mobile: 9849170535.

Place: Visakhapatnam
Dt. 19-12-2022

In the Court of the IV Addl. District Judge : Nellore
I.A.No. 357 / 2021
O.S.No. 56 / 2019

Bayya Sudhakar Prasad - Petitioner / Plaintiff
Vs
1. **Kasa Vijayakumar** - Respondent /Defendant
2. **Nerella Saikiran**
3. **Indian Bank, VIT A.P. Branch**
4. **The District Registrar** Nellore

- Respondents / Proposed 2nd 3rd and 4th Defendants

Notice

To,
R2. Nerella Saikiran, S/o **S.V. Mohan Rao,** D.No.49-11-22-F.F.2 Dhanalakshmi Nilayam, Lalithanagar, Near Akkayya palem, Visakhapatnam Urban - 530 016.

పై నెంబరున పిటిషనరు / వాది పై దావా O.S.No. 56 / 2019 లో మిమ్ములను ప్రపోజ్డ్ పార్టీలుగా (2,3,4 ప్రతివాదు లుగా) చేర్చమని కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే29-12-2022ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

సిహెచ్. వెంకటేశ్వర రావు, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు / వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

క్లాప్ వాహన డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి 8వ వార్డులో క్లాప్ వాహనాల డ్రైవర్లపై జోనల్ కమిషనర్ దురుసు ప్రవర్తించారని, మరికొన్ని సమస్యలపై జోన్-2 కార్యాలయం వద్ద శనివారం డ్రైవర్లు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న డిసిపి సన్యాసిరావు జోనల్ కార్యాలయానికి చేరుకొని సిఐటియు మధురవాడ జోన్ నాయకులు, వాహనాల డ్రైవర్లతో సమస్యలపై చర్చించారు. 30 నుంచి 40 కిలోమీటర్ల దూరం చెత్త సేకరణ చేపట్టే వాహనాలకు మరో సచివాలయం పరిధి బాధ్యతలు అప్పగించారు. 60 నుంచి 90 కిలోమీటర్ల దూరంలో చెత్త సేకరణ చేపట్టే వాహనాలకు మరో వాహనాన్ని అదనంగా ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని డిసిపి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి వాహన డ్రైవరూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వారి పనులు పూర్తి చేసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. డ్రైవర్లు విధి నిర్వహణలో ఏటువంటి సమస్య తలెత్తినా జోనల్ కమిషనర్ కల్పించుకోవద్దన్నారు. ఎఎంహెచ్ఒ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రెటరీలు వివరణ తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఒ శాస్త్రి, జోన్-2 కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎఎంహెచ్ఒ పి.కిషోర్, సిఐటియు మధురవాడ జోన్ నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్ కుమార్, జివిఎంసి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మిక సంఘం విశాఖ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లతో చర్చిస్తున్న డిసిపి సన్యాసిరావు

ఆనందపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ఫ్యామిలీ ఫిజీషియన్‌లో పాల్గొన్న వైద్యులు, సర్పంచ్ చందక లక్ష్మి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ షహనాజ్ సాధియా ఆధ్వర్యాన ఆనందపురంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 98 మందికి వైద్య పరీక్షలు జరిపారు. మధుమేహం, బిపి పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు ఈసీజీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు జరిపారు. వారు వాడుతున్న మందులు వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించి పిల్లల ఆరోగ్యంపై ఆరాతీశారు. అనంతరం సర్పంచ్ చందక లక్ష్మి మాట్లాడుతూ, పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కుటుంబ డాక్టర్ విధానం దోహదపడుతుందన్నారు. 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, పంచాయతీ కార్యదర్శి గారపాటి శ్రీరామ్మూర్తి, డిపిఎమ్ఒ ప్రసాదరావు, సిహెచ్ఒ నమ్మి సాయి గౌతమి, గంట సూర్యకళ, ఆరోగ్య కార్యకర్తలు అదపాక పైడిరాజు, ఆశపు లక్ష్మీరావు, సురేంద్ర, ఆశా కార్యకర్తలు లంక పద్మ, పొట్నూరు అన్నపూర్ణ, మామిడి పద్మ, దొంతల వెంకటలక్ష్మి, పైలెట్ షేక్ కాశీమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-యంత్రాంగం

పిఎం.పాలెం : జివిఎంసి 7వ వార్డు పరిధి మధురవాడ వాంబే కాలనీలో సుమారు రూ.43.05 లక్షలతో పార్కు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ మల్లికార్జున, విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో కలిసి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమస్యలపై ఒక్కొకటిగా శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ విజయనిర్మల మాట్లాడుతూ, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ, పార్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వాంబే కాలనీ గృహాల మరమ్మత్తులకు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తున్నమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లా సుజాత, సత్యనారాయణ, 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, పిల్లా వెంకటరావు, వార్డు వైసిపి అధ్యక్షుడు పోతిన శ్రీను, నాయకులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, పోతిన హనుమంతు, గాదె రోసిరెడ్డి, గుంటుబోయిన సంజీవ్, మొజ్జడ రమణమూర్తి, ముందుండి రాజేశ్వరి, కొండపల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : అనందపురం మండలం మామిడిలో పంచాయతీ దబ్బందలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. దబ్బందలో అంగన్‌వాడి భవనానికి, మామిడిలోవలో రూ.15.74 లక్షలతో బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు మాట్లాడుతూ, పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు, రోడ్లు, డ్రెయిన్లు, కుళాయిల ఏర్పాటుకు పంచాయతీ ద్వారా నిధుల అవకాశం కల్పించాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు రావడంలేదని, పరిశీలించాలని కోరారు.

తాగునీరు, డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని మామిడిలోవ పంచాయతీలో నివసిస్తున్న మన్నెపాలెం వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లు బాగు చేయాలని కోరారు. ఈ సమస్యలు రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ఎంపీపీ శారద ప్రియాంక, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, బొట్ట రామకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, గండిగుండం సర్పంచ్ జి.శ్రీను, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ మణిశంకర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ డోల.దేముడు, మామిడిలోవ పంచాయతీ వైసిపి అధ్యక్షులు బల్రెడ్డి మహేష్, ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార లోకవరపు రామారావు, హౌసింగ్ ఏఈ లోకనాథం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వికలాంగులకు వీల్‌చైర్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో జెడి ఫౌండేషన్ ఆధ్వర్యాన వికలాంగులకు వీల్ చైర్లు అందజేశారు. జెడి ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి శనివారం ఆరిలోవ బాలాజీనగర్‌లో గల జివిఎంసి నిరాశ్రయుల గృహాన్ని సందర్శించారు. అక్కడ వికలాంగులకు వీల్‌చైర్లను ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిరాశ్రయులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. జెడి ఫౌండేషన్ ద్వారా నిరాశ్రయులను ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ జగన్ మురారి, సురేష్ కుమార్, ఆశ్రమ నిర్వాహకులు పరమేశ్వరమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గాడు వెంకటనారాయణ

భగవద్గీత పఠన పోటీలు

ప్రజాశక్తి - తగరపువలస : స్థానిక సంతపేట రామాలయం వద్ద శనివారం భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. భీమిలి ప్రకృతి స్కూల్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి ఎం.హర్షిణి ప్రథమ, 6వ తరగతి విద్యార్థి ఆర్.సత్యప్రసాదరావు ద్వితీయ, ఎం క్షీరజ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏటా ఇక్కడ విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు నిర్వాహకులు సింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ, ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ బహుమతులు అందజేశారు.

ఎమ్‌డి అహ్మద్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి -పిఎం పాలెం : హజరత్ ముక్తియార్ అలీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఎమ్‌డి అహ్మద్‌కు డాక్టరేట్ లభించింది. ట్రస్టు ద్వారా చేస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకుగానూ ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం బెంగళూరులో సత్కరించి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, కంచాలు క్రీడా పరికరాలు అందజేస్తున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు, వేసవిలో కొండవాలు ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. డాక్టరేట్ పట్ల ట్రస్టు సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సృజనాత్మకంగా ఆలోచనలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆలోచనలు సృజనాత్మకంగా ఉండాలని జనరల్ ఇన్స్యూరెన్స్ చీఫ్ అడ్వైజర్ జరజాపు సురేష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌లో శనివారం 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తుకు పునాది పదో తరగతి అని స్పష్టం చేశారు. సబ్జెక్టులో సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఏకాగ్రత అవసరమని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యం

ప్రజాశక్తి - ఆరిలోవ : పెదగదిలి, సాలిపేట ప్రాంతానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని త్రివేణి (19) కనబడుట లేదని తండ్రి బి.అప్పలరాజు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... బి.అప్పలరాజు తన కుటుంబంతో సాలిపేటలో నివాసముంటున్నారు. చిన్న కుమార్తె త్రివేణి (19) ఎయు ఇంజినీరింగు కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతుంది. శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి కనబడలేదు. దీంతో ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడు ముకేష్‌పై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణా షాపులో చోరీ

ప్రజాశక్తి-యస్.రాయవరం: మేజర్ పంచాయతీ తిమ్మాపురం అడ్డురోడ్డులో దొంగలు హల్ చల్ చేశారు. శనివారం ఉదయం తిమ్మాపురం గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి కుసుమంచి నాగేశ్వరరావు తన వీరాంజనేయ కిరాణా దుకాణం యధావిధిగా తెరవగా సామాన్లు చిందర వందరగా పడి ఉండడాన్ని గమనించాడు. తన తోటి వర్తకులకు సమాచారం అందించగా వారంతా ఘటనా స్థలానికి చేరుకున్నారు. దుకాణం వెనుక వైపు నుండి పెంకులు తొలగించి దొంగలు లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. దొంగలు వివిధ రకాల పప్పులు, చాక్లెటు, సిగిరెట్లు తదితర సామగ్రిని దొంగిలించినట్లు బాధితుడు నాగేశ్వరావు తెలిపారు. పోలీసుకులకు ఫిర్యాదు చేయడంపై వర్తకులు మీమాంసలో పడ్డారు. ఇప్పటివరకు వివిధ షాపులలో జరిగిన దొంగతనాల కేసులే ఛేదించని పోలీసులు ఇలాంటివి పట్టించుకుంటారా అని వారు వాపోయారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లిలో పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. ఈ దాడిలో పదిమంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.25,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెవెన్యూ అధికార్లపై ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : తన భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో పేరు మారడంపై పద్మనాభం మండల రెవెన్యూ అధికారులపై మండలంలోని రేవిడి పంచాయతీ మదుర రౌతులపాలెం గ్రామానికి చెందిన తోగురోతు తమ్మయ్య శనివారం భీమిలి ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. రౌతులపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 162/3, ఖాతా నెంబర్ 449లో పదిన్నర సెంట్లు జిరాయితీ పల్లం భూమి తండ్రి నుంచి తనకు వీలునామా ద్వారా దఖలు పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమికి రెవెన్యూ రికార్డుల్లో తన పేరు ఉందని, 1 బి, పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ కూడా 2020 సంవత్సరంలో పొందివున్నానని వివరించారు. ఇటీవల అన్నయ్య తన తోగురోతు అప్పలనాయుడు ఈ భూమిపై వివాదం చేస్తున్నాడని, దీంతో తన వద్ద ఉన్న ఆధారాలతో ముందుస్తుగా భీమునిపట్నం కోర్టులో ఓఎస్ నెంబర్ 405-2022 ఇంజక్షన్ దావా వేశానని తెలిపారు. ఈ భూ వివాదం కోర్టులో ఉండగా అదే భూమిని తన అన్నయ్య తోగురోతు అప్పలనాయుడు పేరున రెవెన్యూ రికార్డులో పేరు మార్చి 1 బి ఇచ్చారని తెలిపారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని గంధవరం, తునివలస, రేవిడి గ్రామాల్లో టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలు నిర్వహించారు. గంధవరంలో జుత్తాడ గణేష్ ఆధ్వర్యాన, రేవిడిలో పి.అప్పలనాయుడు ఆధ్వర్యాన, తునివలసలో ఆర్ఎన్.మూర్తి ఆధ్వర్యాన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్నారు. ధరల పెరుగుదలను, ప్రశ్నించేవారిపై కేసులు పెట్టడాన్ని ప్రజలకు వివరించారు.

మల్కాపురం : 62వ వార్డు పరిధి త్రినాధపురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పిజివిఆర్.నాయుడు ప్రజల సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాలినాయుడు, జోగి, రాజమణి పాల్గొన్నారు.

గంధవరంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

పూర్తి వేతనంపై పెన్షన్ చెల్లించాలి

ప్రజాశక్తి-గాజువాక : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పూర్తివేతనంపై పెన్షన్ కంట్రిబ్యూషన్ చెల్లింపునకు భెల్ విశాఖ యూనిట్ యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి.ప్రకాష్, సహాయ ప్రధాన కార్యదర్శి ఎస్.అప్పారావు డిమాండ్‌చేశారు. ఈ మేరకు భెల్ హెచ్‌పివిపిలో శనివారం మధ్యాహ్నం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ అవకాశం 2023 మార్చి 3 వరకే సుప్రీంకోర్టు ఇచ్చినందున యాజమాన్యం అలసత్వం ప్రదర్శించకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఏ మాత్రం ఆలస్యం చేసినా కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సనపల జగన్నాధరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు విజయకుమార్, భోగేషు, కేస్య, నరపురెడ్డి, నారాయణ, కృష్ణమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి -గాజువాక : నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. జివిఎంసి 76వ వార్డు పరిధి నడుపూరులో సిసి రోడ్లు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజవర్గం మొత్తానికి 60 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా పనులు కూడా పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధి టిబిసి పాయింట్ సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు రెండో విడత ఇళ్ల పట్టాలను వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పేదవానికీ సొంత ఇల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ వై.విజయ్, ఆర్‌పిలు పాల్గొన్నారు.

బ్యాగుల అందజేత

ప్రజాశక్తి -గాజువాక : సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావుకు గాజువాక ఆటోనగర్ పరిశ్రమల యజమానులు జ్యూట్ బ్యాగులను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి అధ్యక్షులు ఎకె.బాలాజీ, ఉపాధ్యక్షులు కృష్ణప్రసాద్, ఐలా సెక్రెటరీ సిహెచ్ సత్యనారాయణ, దేవస్థానం బోర్డు సభ్యులు వారణాసి దినేష్ రాజు పాల్గొన్నారు.

21న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రముఖ కంపెనీలలో 90 ఖాళీల భర్తీకి కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 21న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ (టెక్నికల్) తెలిపారు. ఓం సర్వీసెస్ సంస్థలో డెలివరీ బాయ్స్ 45 ఖాళీలకు పదో తరగతి ఉత్తీర్ణులై, 18–40 వయసు, టూ వీలర్ లైసెన్స్ ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. రూ.13,500 జీతం + ఇన్సెంటివ్ ఉంటుందని వివరించారు. సేల్స్ ప్రమోటర్స్ 15 ఖాళీలకు ఇంటర్/డిగ్రీ అర్హత కలిగి 21 నుంచి 25 వయస్సు, టూ వీలర్ లైసెన్స్ ఉన్న వారు అర్హులని, వీరికి నెలకు రూ.15 వేలు జీతం + టిఎ ఉంటుందని తెలిపారు. సూపర్‌వైజర్ రెండు ఖాళీలకు ఇంటర్/డిగ్రీ అర్హతతో 21 నుంచి 25 మధ్య వయసు, టూ వీలర్ లైసెన్స్ కలవారు అర్హులని, వీరికి నెలకు రూ.17,500 జీతం + టిఎ ఉంటుందని వివరించారు. ఒక మేనేజర్ పోస్ట్ ఖాళీకి డిగ్రీ అర్హతతో 21 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. వీరికి జీతం రూ.33 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

జయభేరి మారుతి సుజుకి సంస్థలో టెక్నీషియన్ ఉద్యోగాలు ఐదు ఖాళీలకు ఐటిఐ మోటార్ మెకానిక్ అర్హతతో 20నుంచి 35 మధ్య వయస్సు గలవారు అర్హులని, వీరికి అనుభవాన్ని బట్టి రూ.11 వేలు నుంచి రూ.18 వేలు జీతం ఉంటుందని తెలిపారు. సర్వీస్ అడ్వైజర్ ఐదు ఖాళీలకు డిప్లొమో/బిటెక్ మెకానికల్ అర్హత, కంప్యూటర్ అవగాహన కలిగి 20 నుంచి 35 మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని, వీరికి నెలకు రూ.12 వేలు జీతం ఉంటుందని వివరించారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హత, కంప్యూటర్ అవగాహన కలిగి, 18 నుంచి 30 మధ్య వయసుగల పురుష అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.13,500 నుంచి రూ.20 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. అకౌంట్ అండ్ ఆడిట్ ఎగ్జిక్యూటివ్స్ నాలుగు ఖాళీలకు 20 నుంచి 35 మధ్య వయసున్న వారు అర్హులని, నెలకు రూ.15వేల జీతం ఉంటుందని తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ మూడు ఖాళీలకు డిగ్రీ అర్హత గల మహిళా అభ్యర్థులు 20 నుంచి 35 మధ్య వయస్సు గల వారు అర్హులని, వీరికి నెలకు రూ.11 వేలు జీతం ఉంటుందని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేషనల్ కెరియర్ సెంటర్ వెబ్‌సైట్ ncs.gov.in తమ వివరాలను నమోదు చేసుకుని, బయోడేటా సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

31లోగా హిందీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : దక్షిణ భారత హిందీ ప్రచార సభ (చెన్నై) ఆధ్వర్యాన జరిగే పరిచయ, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15 నుంచి 31వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు తెలిపారు.

దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు

ఏసిపి త్రినాథ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలో దొంగతనాలు అరికట్టడానికి, పౌరులకు భద్రత కల్పించేందుకు నిఘా పెంచుతున్నామని సౌత్ డివిజన్ లా అండ్ ఆర్డర్ ఏసిపి టి త్రినాథ్, క్రైమ్ ఏసిపి సిహెచ్ పెంటారావు తెలిపారు. ఉక్కునగరంలో జరుగుతున్న వరుస దొంగతనాలపై ఉక్కు నగరం పోలీసులు, 78వ వార్డు కార్పొరేటర్ సంయుక్తంగా స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏసిపిలు మాట్లాడుతూ, త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.ఉక్కునగరంలో సీసీ టీవీలను క్లస్టర్స్‌లో ఏర్పాటు చేసేలా, రాత్రి గస్తీకి హోంగార్డుల సంఖ్య పెంచేందుకు స్టీల్ యాజమాన్యంతో చర్చిస్తామని చెప్పారు. క్వార్టర్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తే లాక్డ్ హౌసింగ్ మోనిటరింగ్ చేపడతామని తెలిపారు. ప్రజల సహకారంతోనే దొంగతనాలపై చర్యలు సాధ్యమన్నారు. డోర్ లాకింగ్ మానిటరింగ్ సెల్ ద్వారా నివాస గృహాలపై నిఘా ఉంటుందని వివరించారు. దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. సాధారణంగా తాళం వేసిన ఇళ్లలో మాత్రమే దొంగతనాలు జరుగుతాయని, అటువంటి సందర్భాలలో విలువైన వస్తువులను ఇంటిలో వదిలివేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఉక్కు నగరంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, దీనిని నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భయ్యా మల్లయ్య, స్టీల్ ప్లాంట్ సిఐలు వి.శ్రీనివాసరావు, పి.సూర్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాసరావు, వివిధ యూనియన్ల ప్రతినిధులు, ఉక్కు నగర వాసులు, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏసిపి త్రినాథ్, చిత్రంలో కార్పొరేటర్ గంగారావు తదితరులు

సమిష్టి పోరాటాలకు సిద్ధం

కెవిపిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణలో వక్తల పిలుపు

కెవిపిఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, తౌడన్న, చిన్నంనాయుడు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : బిజెపి అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమిష్టి పోరాటాలకు సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో కెవిపిఎస్ స్టీల్ డివిజన్, విశాఖ జిల్లా కెవిపిఎస్ ఆధ్వర్యాన ముద్రించిన క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అదాని, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తోందని విమర్శించారు. ప్రైవేటుపరమైతే రిజర్వేషన్లు అమలు కావన్నారు. కెవిపిఎస్ స్టీల్ డివిజన్ అధ్యక్షులు తిమూతి మాట్లాడుతూ, ప్రశ్నించే వారిపై బిజెపి ప్రభుత్వం దాడులు చేయిస్తుందన్నారు. కార్మికులు, ప్రజలపై ముప్పేట దాడిచేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చిన్నంనాయుడు, తౌడన్న, తవిటయ్య, తోకాడ సమైక్ అపార్ట్‌మెంట్ ప్రజలు పాల్గొన్నారు.

పద్మనాభరెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : సామాన్యుల జీవితాల్లో వెలుగు రేఖగా కీర్తిశేషులు న్యాయవాది పద్మనాభరెడ్డి నిలిచారని ఉభయ రాష్ట్రాలకు చెందిన పలువురు న్యాయమూర్తులు కొనియాడారు. నగరంలోని ఒక హోటల్ శనివారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యాన ఉమ్మడి హైకోర్టు న్యాయవాది పద్మనాభరెడ్డి స్మారక ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్ర హైకోర్టుల నుంచి పలువురు న్యాయమూర్తులు హాజరయ్యారు. రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, పద్మనాభరెడ్డి తనయుడు జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, న్యాయవాదిగా తన తండ్రి పద్మనాభరెడ్డి నుంచి నేర్చుకున్న అనుభవాలను గుర్తుచేసుకున్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు మధ్య సుహృద్భావ వాతావరణం అవసరమన్నారు. ఒకే కేసులో రెండు తీర్పులు న్యాయపరమైన చిక్కులు పరిష్కారంపై మాట్లాడుతూ మొదటి తీర్పు ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలీసులు సాక్ష్యాలను సేకరించే పద్ధతుల్లో లోపాలను, విఆర్ఓ వంటి అధికారుల సాక్ష్యాలు, వాటిపై తీర్పుల్లో పరిణామాలను వివరించారు. సాంకేతిక యుగంలో వీడియో ఆడియో ఫోను సమాచార రికార్డు సమర్పించే సమయంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను కూడా జత చేయాలన్నారు. విశాఖ జిల్లా న్యాయ పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషాయి మాట్లాడుతూ, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన చట్టాలను వివరించారు. సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం వల్ల నేడు అనేక సమస్యలకు దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రరాయ్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం 20వ ప్రకరణ నేర శిక్షాస్మృతిపై మాట్లాడారు. ఎన్నికల నేరాలు, తప్పుడు హామీలు, వ్యక్తిత్వం, వ్యక్తి అరెస్టులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కెవిఎస్ సురేష్ కుమార్, జాతీయ కార్యదర్శి సభ్యులు బొమ్మకంటి ప్రభాకర్, ముప్పాళ్ళ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్మారకోపాన్యాసంలో మాట్లాడుతున్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్

'ఉత్తరం'లో కెకె.రాజు గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యాలయానికి వచ్చి సమస్యలపై వినతులను కెకె.రాజుకు అందించారు. ప్రజల సమస్యలపై అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలు

ప్రజాశక్తి-గాజువాక: వివిధ అవసరాల నిమిత్తం సచివాలయాలకు వచ్చే వార్డు ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందివ్వాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు సూచించారు. వార్డులోని ఆయా సచివాలయాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.బీసీ రోడ్డు కాకతీయ కూడలిలోని సచివాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది హాజరు, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవ చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని, దాని విలువను కాపాడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, వాలంటీర్లపై ఉందని అన్నారు. ప్రభుత్వ సేవల విషయంలో అలసత్వం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పథకాలు సమర్థవంతంగా అమలుకావటంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిదే గురుతర బాధ్యత అని పేర్కొన్నారు.

'గడపగడపకూ సంక్షేమం'

ప్రజాశక్తి -కంచరపాలెం : గడపగడపకూ సంక్షేమమే లక్షంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి గాంధీనగర్–2, భీమనగర్, అప్పయ్యనగర్‌లో శనివారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, పేడాడ రమణికుమారి, పైడి శ్రీను, రాయుడు శ్రీను, దిడ్డి రమేష్, అంబటి శైలేష్, నమ్మి నాగేశ్వరావు, తిరుమల రావు, షేక్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభ జయప్రదానికి బైక్ ర్యాలీ

పరవాడలో బైక్ ర్యాలీలో నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- పరవాడ

ఈ నెల 18, 19 తేదీల్లో పరవాడలో జరగనున్న సిఐటియు 12వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక సినిమా హాల్ సెంటర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు మాట్లాడుతూ సిఐటియు మహాసభలు పారిశ్రామిక ప్రాంతమైన పరవాడలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహాసభను పురస్కరించుకొని 18వ తేదీన స్థానిక తహశీల్దారు కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన, భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలో కార్మిక సమస్యలు, ప్రభుత్వ విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. 24 మండలాల నుండి 20 రంగాలకు చెందిన కార్మిక ప్రతినిధులు ఈ మహాసభకు హాజరవుతాయని తెలిపారు. బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. నర్సింగరావు, నాయకులు బేబీరాణి ముఖ్య వక్తలుగా ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ ర్యాలీ, బహిరంగ సభలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, మండల నాయకులు ఎర్ల బాబ్జీ, కృష్ణ, కన్నారు నాయుడు, గేదెల అప్పారావు, సిహెచ్.ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శనివారం దేవరాపల్లిలో కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి, ఐకెపి యునియన్ జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ ఈ మహాసభల్లో ఆశా, అంగన్వాడీ, విఆర్ఎ, విద్యుత్, కో-ఆపరేటివ్, మధ్యాహ్నం భోజన కార్మికులు విఒఎ వంటి స్కీం వర్కర్ల సమస్యలతో పాటు అసంఘటిత కార్మికులు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, కె.అప్పారావు, రాము, అప్పలనాయుడు, లక్ష్మీ రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

47వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన 47వ రోజూ కొనసాగింది. శనివారం నేవీ మెయిన్ గేట్ ముందు ఎనిమిది గ్రామాల నిర్వాసితులు రోడ్డుపై బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 47 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తమ సమస్యల పరిష్కారం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనీసం కనికరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జెట్టీ నిర్మాణం చేయాలని, అంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా నేవీ గేట్ లోపల నుండి మత్స్యకారులను వేటకు అనుమతి ఇవ్వాలని, పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని, నిర్వాసిత కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసిత జెఎసి పెద్దలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలపై..

రూ.42 వేల కోట్లు విద్యుత్ ఛార్జీల బాదుడు

టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్

మాట్లాడుతున్న నాగజగదీష్, చిత్రంలో కృష్ణ, కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి పాలనలో ప్రజలపై రూ.42 వేల కోట్ల మేరకు విద్యుత్ ఛార్జీలు మోపారని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగడల కృష్ణ, మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సరాసరి వినియోగాన్ని బట్టి కేటగిరైజేషన్ విధానాన్ని రద్దు చేసి, నెలవారీ వాడకం ఆధారంగా కేటగిరి నిర్ణయించే నూతన విధానాన్ని జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. దీంతో పేద మధ్యతరగతి ప్రజలపై ఎన్నడూ లేనంత భారం పడిందన్నారు. 400 యూనిట్లు పైబడి వినియోగించే సంపన్న వర్గాలకు కేవలం ఆరు శాతం పెంచి, 125 యూనిట్లు లోపు వాడే పేద వర్గాలపై 57 విద్యుత్ ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. ప్రభుత్వం మార్కెట్లో తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రజలకు సరఫరా చేస్తోందన్నారు. సంక్షేమం ముసుగులో ప్రజల నుంచి దోచుకుంటుందని విమర్శించారు. చంద్రబాబు పాలనలో ఐదేళ్లపాటు విద్యుత్ ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్తు 24 గంటలు సరఫరా చేశారని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి గారడీలను ప్రజలు గమనిస్తున్నారని, ఈ ప్రభుత్వాన్ని బంగాళా ఖాతంలో కలపడం ఖాయమని హెచ్చరించారు.

సమావేశంలో పాల్గొన్న సుగర్ ఎమ్‌డి, జెడ్‌పిటిసి

ప్రతి ఒక్కరి నుంచీ చెరుకు కొనుగోలు

- గోవాడ సుగర్స్ ఎమ్‌డి సన్యాసినాయుడు

ప్రజాశక్తి-వడ్డాది

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులతో పాటు సభ్యులు కాని వారి నుంచి కూడా చెరకు కొనుగోలు చేస్తామని గోవాడ సుగర్స్ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు తెలిపారు. శనివారం వడ్డాది చెరకు కాటా వద్ద ఫ్యాక్టరీ సభ్య రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతేడాది 2.91 లక్షల టన్నులు చెరకు క్రషింగ్ చేశామని, ఈ ఏడాది 3 లక్షలు క్రషింగ్ లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఈనెల 13న క్రషింగ్ ప్రారంభమైందన్నారు. వరి కోతల కారణంగా శుక్ర, శనివారాలు క్రషింగ్ నిలిపివేసినట్లు చెప్పారు. ఏటికొప్పాక, తుమ్మపాల ఫ్యాక్టరీల పరిధిలోని కొన్ని కాటాల నుండి చెరకు సేకరిస్తామన్నారు. వారికి దగ్గరలోని కాటా వరకూ రవాణా ఛార్జీలు అదనంగా ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం మద్దతు ధర టన్నుకి రూ.2,821 చెల్లిస్తున్నామని చెప్పారు. గతేడాది బకాయిల చెల్లింపులు పూర్తయ్యాయన్నారు. గత ఏడాది రైతుల పొదుపుపై వడ్డీ కూడా చెల్లించామని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పిటిసి దొండా రాంబాబు, సిడిఓ కె.రామం, కేన్ ఇన్‌స్పెక్టర్ మధు, బిజెపి నేత ఎస్.చినవెంకయ్య దొర పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థిని దుర్గాభవానితో పాఠశాల ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు దుర్గా భవాని ఎంపిక

ప్రజాశక్తి -దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దారపు దుర్గా భవాని ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవలే తవ్వవానిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కబడ్డీ పోటీలలో జిల్లా స్థాయి పోటీలకు దుర్గా భవాని అర్హత సాధించింది. ఈ సందర్భంగా శనివారం దుర్గాభవానిని పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రామకృష్ణ, ఈశ్వరరావు, జి.సంధ్యారాణి, ప్రసాద్, రాజేశ్వరి, గాయత్రి అభినందించారు.

ఆర్ అండ్ బి అధికారులతో డిప్యూటీ సిఎం సమీక్ష

ప్రజాశక్తి -దేవరాపల్లి : జిల్లా రోడ్లు, భవనాలశాఖ అధికారులతో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం తారువలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలోని రోడ్ల ప్రత్యేక మరమ్మతులకు సంబంధించి 12 రకాల పనులను, 83 కిలోమీటర్ల మేర రూ.16.2 కోట్లతో చేపట్టే పనులపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో 57 పిరియాడికల్ మెయింటెన్స్ పనులపై అధికారులకు ఉప ముఖ్యమంత్రి బూడి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ రమేష్, డిఈ ధనుంజయ్, వివిధ మండలాల జెఈలు పాల్గొన్నారు.

నేడు జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : చోడవరంలో నూతనంగా నిర్మించిన జనసేన పార్టీ కార్యాలయాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ రాజు ఆదివారం ప్రారంభిస్తున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షులు డిఎస్ నాయుడు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పార్టీ పెద్దలు టి.శివ శంకర్రావు, బొలిశెట్టి సత్యనారాయణ, కోన తాతారావు, పలు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీల సభ్యులు, జనసేన కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ తుంపాల రమేష్, వడ్డాది అధ్యక్షులు ఎడ్ల రామ్మూర్తి పాల్గొన్నారు.

ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో

ఘనంగా వెంకటేశ్వర కల్యాణం

సాంస్కృతిక కార్యక్రమాల నడుమ నిర్వహిస్తున్న భారీ ఊరేగింపు

వెంకటేశ్వరస్వామి ఊరేగింపు రథంపై ఎంవిఆర్ దంపతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి కల్యాణం మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో అలివేలుమంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలు గ్రామాల నుంచి విచ్చేసిన మహిళలు కోలాటాలు నిర్వహించారు. తప్పెట గుళ్ళు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు మధ్య స్వామి వారి ఊరేగింపు జరిగింది. ముందుగా సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద నుంచి రింగ్ రోడ్డు, చిన్న నాలుగు రోడ్ల జంక్షన్, పోలీస్ స్టేషన్, ఎన్టీఆర్ స్టేడియం, నెహ్రూ చౌక్ మీదుగా ఊరేగింపు నరసింగరావుపేటలో ఎంవిఆర్ ఇంటి వరకు నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో భారీ విద్యుత్ అలంకరణ, నెహ్రూ చౌక్ జంక్షన్, రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో భారీ విద్యుత్తు ఆర్చిలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు సినిమా యాక్టర్లు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. నరసింగరావుపేటలోని ఆయన స్వగృహంలో జరిగిన వెంకటేశ్వర కల్యాణాన్ని తిలకించేందుకు భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ కల్యాణోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఆయన సొంత భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఈ కల్యాణోత్సవాన్ని సుమారు లక్ష 50వేల మంది తిలకించే ఏర్పాట్లు చేశారు. ముత్యాల వెంకటేశ్వరరావు సూర్య కుమారి, వారి కుమారులు సతీష్, రాజేష్ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు రథంపై భక్తులకు అభివాదం చేశారు. ఊరేగింపు పండగ వాతావరణం తలపించింది.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి సూరిబాబు

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న హౌసింగ్ కాలనీలను అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పూర్తి చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు ఆదేశించారు. మండలంలోని రేబాక జగనన్న హౌసింగ్ కాలనీని శనివారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. కాలనీల నిర్మాణంలో సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యులు మంత్రి సంతోషం, మండల కో ఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, తహశీల్దారు గంగాధర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ ధర్మారావు, హౌసింగ్ డిఈ, ఏఈ, వెలుగు ఏపిఎం, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, గ్రామ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాయితీ ట్రైన్ పాస్‌ల అందజేత

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : వికలాంగులు రాయితీ ట్రైన్ పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు కోరారు. శనివారం మండలంలోని రాజాంలో 15 మంది వికలాంగులకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి వైద్య అధికారులు మంజూరు చేసిన ట్రైన్ పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీ ట్రైన్ పాస్‌లు కావలసినవారు ఆధార్, సదరం సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అందచేస్తే సంబంధిత అధికారుల ద్వారా మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మళ్లాం మాజీ సర్పంచ్ మువ్వల అప్పారావు పాల్గొన్నారు.

చోడవరంలో చోరీ

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం పట్టణంలోని గునిశెట్టివారి వీధిలో నివాసం ఉంటున్న దగ్గు పార్వతి ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఏడున్నర తులాల బంగారం, 30 తులాల వెండి దొంగలు ఎత్తుకెళ్లారు. పార్వతి, కుమారుడు జగదీష్ శ్రీదేవి పిల్లలతో కలిసి విజయవాడ కనకదుర్గ దర్శనానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం రాత్రి దొంగల పడి దోచుకెళ్లారు. పక్కింటి వారు తలుపులు తీసి ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు స్థానిక సిఐ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 2023 జనవరి 14వ తేదీ వరకు ఈ ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతాయని అర్చకులు అంగర రాజగోపాలచారి, శ్రీకాంత్ ఆచార్యులు తెలిపారు. ప్రతిరోజు స్వామివారికి నిత్యార్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 6.17 గంటలకు నెల గంట మోగించి ఉత్సవాలు ప్రారంభించారు. శనివారం తెల్లవారు జాము నుండే స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అదేవిధంగా స్థానిక గీతా ఆశ్రమంలో కూడా ధనుర్మాసోత్సవాలు ప్రారంభించారు.

గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గౌరీ పంచాయతన దేవాలయంలో శనివారం గౌరీ పరమేశ్వరుల 175వ ఊంజల్ సేవ నిర్వహించారు. దేవాలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, శేషు సాయి వేద విధులైన పండితులచే నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో దాడి జగ్గ రామప్పారావు లక్ష్మి దంపతులు, దాడి నాయుడు విజయ దంపతులు పాల్గొన్నారు. గౌరీ పరమేశ్వరి అమృత వర్షిణి పెతకంశెట్టి సుజాత శిష్య బృందంచే కోలాటాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బొడ్డేడ సన్యాసి నాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి శివ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు

టిడిపి నాయకుడు పైలా ప్రసాదరావును సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కె.కోటపాడు

దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు డిమాండ్ చేశారు. శనివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐటిఐ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లపై తెలుగుదేశం పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. మండల పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ మాట్లాడుతూ 2018 నుండి పిఆర్‌సి, డిఎ బకాయిలు అందించాలని డిమాండ్ చేశారు. షరతులు లేని హెల్త్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని, నగదు రహిత హెల్త్ కార్డులు అందించాలని కోరారు. ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మొత్తం తొమ్మిది రకాల డిమాండ్లతో రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు జి.అప్పలనాయుడు, కె.సరోజినీబాయి, మల్లు నాయుడు, బత్తి వెంకటరమణ, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం బూడి

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - దేవరాపల్లి

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని బాధితుడు ఇంటికి వెళ్లి అందజేశారు. గ్రామానికి చెందిన ఎంపిటిసి పంచాడ సింహాచలం నాయుడు బోన్, టిబి వ్యాధితో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. దీని నిమిత్తం అయిన ఖర్చుకు వివరాలతో సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు ప్రత్యేక చొరవతో సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి సింహాచలం నాయుడు వైద్యానికి అయిన రూ.4.94 లక్షలు మంజూరు చేయించారు. ఈ చెక్‌ను సింహాచలం నాయుడు ఇంటికి ఉప ముఖ్యమంత్రి స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి సత్యం, వైస్ ఎంపిపి ఉగ్గిరోకుల గంగాభవాని అప్పారావు, మామిడిపల్లి, కొత్తపెంట, తిమిరం సర్పంచులు సూరి నాయుడు, రొంగలి వెంకటరావు, రెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వడ్డాది వంతెన మరమ్మతు పనులు ప్రారంభం

జెసిబితో మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-వడ్డాది

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యాన వడ్డాది వంతెనకు మరమ్మతు పనులు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. సుగర్ ఫ్యాక్టరీకి చెరకు రవాణాకు ఇబ్బందులు ఏర్పడడంతో యుద్ధ ప్రతిపాదికన ఈ మరమ్మతు పనులు చేపట్టారు. దీనికి ఫ్యాక్టరీ నుండి రూ.6 లక్షలు నిధులు విడుదల చేశారు. వంతెనపై రాకపోకలు నిలుపుదల చేసి శనివారం తెల్లవారి వరకు జెసిబితో బండరాళ్లు వేశారు. గతంలో పేర్చిన బండరాలను తొలగించి కొత్తగా పెద్దరాళ్లను తీసుకొచ్చి వెడల్పు చేసి వంతెన నాలుగు ఖానాల మధ్య రాళ్లను పేర్చారు. శనివారం గోవాడ సుగర్స్ ఎమ్‌డి సన్యాసినాయుడు, సిడిఓ రామం, జడ్పిటిసి దొండా రాంబాబు వంతెన మరమ్మతు పనులను పరిశీలించారు. వాహనాల రాకపోకలు దృష్ట్యా రాత్రివేళ మాత్రమే పనులు చేపడతామని, మరో 48 గంటల్లో పనులు పూర్తవుతాయని ఎమ్‌డి తెలిపారు. ఈ పనులకు సహకరించిన ఎమ్మెల్యే ధర్మశ్రీ, కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, గ్రామ పెద్దలకు, రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పొట్టిదొరపాలెంలో రీ సర్వే పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, పొట్టిదొరపాలెంలో శనివారం భూముల రీ సర్వే పనులను ఆ గ్రామ సర్పంచ్ అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు భూములకు రికార్డులు పూర్తిగా లేవని, ఉన్నంత వరకు ఆన్లైన్ లేకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం భూ రీ సర్వే ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమం సుమారు నెలరోజుల వరకు కొనసాగుతుందని, గ్రామంలో ప్రతి భూమిని ఆధునిక టెక్నాలజీతో సర్వే చేసి సంబంధిత రైతులకు పాస్ పుస్తకాలు మంజూరు చేస్తారని తెలిపారు. సర్వే అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుద్దేటి శ్రీనివాస్, విఆర్ఓ తరుణ్, సర్వేయర్ ప్రశాంత్, వైసిపి నాయకులు రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-దేవరాపల్లి : తెనుగుపూడి గురుకుల పాఠశాలలో అటెండర్ (అవుట్ సోర్సింగ్)గా పనిచేస్తున్న వరదపురెడ్డి చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, డిసిఓ రూపవతి, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.రవీంద్రనాథ్, పాఠశాల సిబ్బంది శనివారం పరామర్శించి ఓదార్చారు. చంద్రశేఖర్ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడుతో మాట్లాడి చంద్రశేఖర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

చంద్రశేఖర్ భార్యను ఓదార్చుతున్న సిడిఒ రూపవతి, మాజీ ఎంపిపి భాస్కరరావు

రిలే నిరాహార దీక్షకు అనుమతి కోరుతూ వినతి

ప్రజాశక్తి - పరవాడ

రాంకీ ఫార్మాసిటీ కార్యాలయం కూడలిలో రిలే నిరాహార దీక్ష చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ వైసిపి మాజీ మండల అధ్యక్షులు బొద్దపు చిన్నారావు శనివారం పరవాడ సిఐ పి.ఈశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాసిటీ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని ఈ నెల 27 నుండి రిలే నిరాహార దీక్షలు చేనున్నట్లు చెప్పారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని అనేకసార్లు వినతులు ఇచ్చినప్పటికీ ఉపాధి కల్పించలేదని, దీంతో గత్యంతరం లేక నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొద్దపు శ్రీనివాసరావు, కంచిపాటి భాస్కరరావు, నెల్లి శ్రీనివాసరావు, అప్పలరాజు, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిఐకి వినతిపత్రం ఇస్తున్న బొద్దపు చిన్నారావు

పొన్నాడ శ్రీనివాస్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

ఎయు విసికి సిపిఎం, సిపిఐ ఫ్లోర్ లీడర్ల విజ్ఞప్తి

ప్రజాశక్తి - విశాఖపట్నం

డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్‌పై ఎయు యాజమాన్యం విధించిన నిర్బంధాన్ని ఆపి వెంటనే ఆయన్ను విధుల్లోకి తీసుకోవాలని జివిఎంసిలో సిపిఎం, సిపిఐ ఫ్లోర్ లీడర్లు డాక్టర్ బి.గంగారావు, ఎజె.స్టాలిన్ శుక్రవారం ఎయు విసికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. డాక్టర్ శ్రీనివాస్ తన విద్య, పరిశోధన అంతా పేద, గ్రామీణ ప్రజల మౌలిక ప్రమాణాలు పెంపుదలే లక్ష్యంగా కృషి చేశారన్నారు. తను కాలేజీ చదువు ప్రారంభం నుండి రాష్ట్రంలో అణగారిన వర్గాల విద్యార్థుల సమస్యలపై పని చేశారని తెలిపారు. ఎం.ఫిల్, పిహెచ్‌డి పరిశోధన నిమిత్తం మారు మూల గిరిజన ప్రాంతాన్ని ఎంచుకొని సుమారు 700 గ్రామాల్లో వేలాది గిరిజనులను సైంటిఫిక్‌గా పరీక్షించి అనేక అవగాహన శిబిరాలు నిర్వహించారని తెలిపారు. శ్రీనివాస్ నిస్వార్ధ సేవలను మెచ్చుకొని నాటి ఐటిడిఎ పిఒ శరత్ కుమార్ లక్ష రూపాయలు ద్వారా పారితోషికం ఇచ్చారని, మరిన్ని జబ్బులు అధ్యయనానికి స్పెషల్ హెల్త్ ప్రాజెక్ట్ కూడా ఆయనకు ఇచ్చారని వెల్లడించారు. 18 వరకు అంతర్జాతీయ, జాతీయ పబ్లికేషన్స్‌తో పాటు ఆదివాసీ ప్రాంతాల్లో జబ్బులకు పరిష్కారాలు చూపుతూ 3 పుస్తకాలు కూడా రాశారని తెలిపారు. తూర్పు కనుమల్లో ఎన్నో దశాబ్దాల నుండి అర్థంకాని వింతైన బోన్ డిజార్డర్ జబ్బుని కనుగొని, దానికి మూల కారణాన్ని పరిష్కారాన్ని ఆయన చూపెట్టారని తెలిపారు. తన పరిశోధనలో ఇలాంటి ముఖ్య విషయాలను టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూ లాంటి ఇంగ్లీష్ పత్రికలు ప్రముఖంగా మెయిన్ పేజీల్లో ప్రచురించాయని తెలిపారు. వ్యక్తిత్వాన్ని, అర్హతలను గుర్తించి జువాలజీ విభాగంలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌ను కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల శాఖ తలపెట్టిన భారత్ అభియాన్‌లో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ యూనివర్సిటీ నియమించిందని గుర్తు చేశారు. ఇలాంటి ప్రగతిశీల అభ్యుదయ పరిశోధకుడిని అకారణంగా తొలగించటం అమానుషంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇంతవరకూ వృత్తిపరంగా ఎలాంటి రిమార్క్ లేనటువంటి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్‌ని వీలైనంత త్వరగా విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గృహ నిర్మాణ పనులు ప్రారంభించాలి

లే అవుట్లలో అధికారులు సందర్శన

పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రేబాక గ్రామంలో శనివారం జగనన్న లేఅవుట్‌ను హౌసింగ్ డే సందర్భంగా తహసీల్దార్ సుబ్రహ్మణ్యం శాస్త్రి, ఎంపీడీవో సీతారామరాజు, హౌసింగ్ అధికారులు సందర్శించారు. సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి, త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ఆలస్యమైందన్నారు. జగనన్న లే అవుట్ లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం గొడిచెర్ల, చినదొడ్డిగల్లు సచివాలయాల్లో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి, ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శిలు కిరణ్, సాయి లక్ష్మి, వైసిపి నాయకులు అల్లు రమణ, కాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొటవురట్ల: మండల వ్యాప్తంగా జగనన్న గృహాలు వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. శనివారం శనివారం ఆమె మండల సమావేశం మందిరంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పలు గ్రామాల్లో నిర్మాణాలు నత్త నడకన సాగడంపై పలువురు అధికారుల పట్ల అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె పందూరు, రామచంద్రపురం గ్రామాల్లో సందర్శించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ జగదీశ్వరరావు, పిఆర్ ఇంజనీర్ వర్మ, రామచంద్రపురం వైసిపి నాయకులు వెంకటరమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యటిస్తున్న అధికారులు



ఆందోళన చేస్తున్న అప్పలరాజు ,మత్స్యకారులు

381వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో పైప్‌లైన్‌కు ఎట్టి పరిస్థితు ల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహా ధర్నా శనివారం నాటికి 381వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ హెటిరో కంపెనీ వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంత మత్స్య సంపద నశించి మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని పైప్ లైన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసుపల్లి నూకరాజు, మైలపల్లి జాన్, మైలపల్లి శివాజీ, మైలపల్లి బాబ్జీ, చోడిపల్లి రాజు, పిక్కి రాజు, కారే సతీష్, కారే నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న పూజారులు , భక్తులు

వైభవంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుండి ధనుర్మాస తిరివీధి సేవలు ప్రారంభమయ్యాయి. లక్క గరుడ వాహనంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను చిన్న పల్లకి వాహనంలో తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గోదాదేవి అమ్మవారి ధనుర్మాస వ్రతంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, భాగవతం గోపాలచార్యులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేట పంచాయతీలో సర్పంచ్ గడ్డం ఆదిలక్ష్మి, ఆనంద్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలో నీటి ట్యాంకులు, వీధి కొళాయిల దగ్గర బ్లీచింగ్ చల్లించి దోమల నివారణకు పలు సూచనలు చేశారు. ఇంటి సమీపంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమలు అధికంగా ప్రబలితే వ్యాధులకు గురవుతారని, దీన్ని గ్రహించుకొని ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మహాలక్ష్మి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి విజ్ఞాన విహార్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం : మండల పరిధి గుడిలోవలోని సరస్వతి విజ్ఞాన విహార్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫైర్ జంపింగ్, బైక్ విన్యాసాలు, పిరమిడ్స్ ఏర్పాటు తదితర విన్యాసాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఎస్.పద్మావతి మాట్లాడుతూ, సరస్వతీ విజ్ఞాన విహార్ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరు అన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన విహార్ చైర్మన్ పివి.నారాయణరావు, వైసిపి నాయకులు మజ్జి వెంకటరావు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రేమ్‌కుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి నూతనంగా భాధ్యతలు స్వీకరించిన ప్రేమ్ కుమార్‌కు స్థానిక యూటీఎఫ్ నాయకులు పుష్ప గుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ నిపుణులతో తయారు చేసిన పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్‌ని ప్రేమ్ కుమార్‌తో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ స్థాయి నాయకులు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నాబ్బాయి, సీనియర్ నాయకులు ఎంచిట్టియ్య, జిల్లా కార్యదర్శి గంటేడ అప్పలరాజు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గాయిత్రి, క్రాంతి కిరణ్, జల్లూరు ప్రసాద్, సాంబమూర్తి, ఈశ్వరవర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌కుమార్‌ను అభినందిస్తున్న యుటిఎఫ్ నేతలు

మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అనర్హులకు జగనన్న ఇళ్లు : టిడిపి

ప్రజాశక్తి-గొలుగొండ: అర్హులకు ఇవ్వాల్సిన జగనన్న ఇళ్లను వైసిపి నాయకులు అనర్హులకు ఇవ్వడం సరికాదని టీడీపీ మాజీ ఎంపిటిసి నాతిరెడ్డి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ అదపురెడ్డి ప్రభాకర్‌లు విమర్శించారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జగనన్న కాలనీలో వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ (బాబ్జి)కి రెండు అంతస్తుల ఇల్లు ఉండగా జగనన్న కాలనీలో భార్య సుర్ల భవానీ పేరున ఇల్లు తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే పునాది కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. గ్రామంలో అర్హులు మిగిలి ఉన్నప్పటికీ వారికి ఇవ్వకుండా వైసిపి నాయకులు దోచేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు తక్షణమే స్పందించి పేదవారికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధర్మరాజు, నూకాంబిక ఆలయ మాజీ చైర్మన్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

20 నుంచి సిపిఐ వారోత్సవాలు

ప్రజాశక్తి-గొలుగొండ: సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవంగా ఈనెల 20వ తేదీ నుంచి 26 వరకు చేపట్టే వారోత్సవాలు జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పిలుపునిచ్చారు. శనివారం గొలుగొండ పాల కేంద్రం వద్ద సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు అన్ని హక్కులతో పట్టాలు ఇవ్వాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాల్లో చేర్చి పేదలకు భూపంపిణీ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21న విజయవాడలో జరిగే భూసాధన రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, కార్యవర్గ సమితి సభ్యులు జి.రాధాకృష్ణ, ఎస్.వాసుదేవరావు, ఎన్.బాబులు, కె.దొరబాబు, కె.రాంబాబు, పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

ఎంపిపి పైలా రాజు

ప్రజాశక్తి- కొత్తకోట

రైతును రాజుగా చేసేందుకు సీఎం జగన్ తీవ్రంగా కృషి చేస్తున్నారని రావికమతం ఎంపీపీ పైల రాజు కొనియాడారు. శనివారం కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజు మాట్లాడుతూ, రైతుకు మరింత లాభసాటిగా ఉండేం దుకు మునిపెన్నడూ లేని విధంగా ఆన్ లైన్ పద్ధతిలోనే ధాన్యం కొనుగోలు ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మిల్లర్ల సమస్యలను అధిగమించేందుకు నేరుగా ఆన్‌లైన్ పద్ధతిలో గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. 100 కేజీల ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2060 కాగా సాధారణ రకం ధాన్యానికి రూ.2040ల ధరను ప్రభుత్వం చెల్లిస్తోందని ఎంపిపి చెప్పారు. రైతులకు 40 కేజీల ప్రతి గన్ని బ్యాగ్ కొనుగోలుకు రూ.3.39 చొప్పున అదనంగా చెల్లిస్తూ లేబర్ ఛార్జిగా రూ.25 లు ప్రభుత్వం చెల్లిస్తోందని వివరించారు. దూరాన్ని బట్టి రవాణా ఛార్జి లు కూడా ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. మండల పరిధిలో కొత్తకోటతో పాటు మేడివాడ, రావికమతం, చినపాచిల పిఏసిఎస్ సం ఘాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు ఎంపిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడి సత్యదేవ్, మండల అగ్రో అడ్వైజరీ చైర్మన్ కంచిపాటి జగ్గారావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, భవానీ ప్రసాద్, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, రొంగలి రామకృష్ణ, ఎంపిటిసి పూడి దేవ, పైల దాసు, ఉప సర్పంచ్ జి.రాజారావు, మాజీ ఉప సర్పంచ్ కె.గున్నాజీ, ఏవో రమేష్, సహకార సంఘం సీఈఓ రఘు పలువురు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి

హాజరైన రైతులు, గ్రామస్తులు

సహకార సంఘాల బలోపేతంతో మేలు

ప్రజాశక్తి-కోటవురట్ల: నాతవరం మండల కేంద్రంలోని సచివాలయం వద్ద సహకార సంఘ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిసిసిబి మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సహకారం సంఘాల బలోపేతానికి రైతులు ఐకమత్యంగా ఉండాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లించినట్లయితే వడ్డీ రాయితీ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సహకార సంఘ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

శారద వర్ధంతి సభల్లో వక్తలు డిమాండ్

శ్రామిక మహిళ ఉద్యమ నేత డి.శారద వర్ధంతి కార్యక్రమాలను శనివారం విశాఖ జిల్లాలో పలుచోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఘన నివాళ్లర్పించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని వర్ధంతి సభల్లో పాల్గొన్న వక్తలు డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా శ్రామిక మహిళ ఉద్యమ నిర్మాత డి.శారద వర్ధంతి కార్యక్రమం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు బి.పద్మ అధ్యక్షత వహించారు. ముందుగా శారద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యవక్తగా విచ్చేసిన డాక్టర్ కె.పద్మ మాట్లాడుతూ ఇంటా బయటా నిర్ణయాధికారాలలో మహిళల స్థానం మారకుండా సమాజాభివృద్ధి జరగదని చరిత్ర చెబుతోందన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని గొప్పలు చెప్పుకునే మన దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లు దశాబ్దాలుగా తెర మరుగున పడిందన్నారు. జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళలకు 1/3 వంతు రిజర్వేషన్ కల్పించాలని మహిళా సంఘాలు సుదీర్ఘకాలంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నాయన్నారు. 1996లో లోక్‌సభలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రభస జరిగిందన్నారు. వామపక్షాలు మినహా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఏడున్నర సంవత్సరాలలో మహిళా బిల్లు ప్రస్తావనే లేదని ఆవేదన వెలిబుచ్చారు. మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టం చేస్తామని ఎన్నికల ప్రణాళికలలో అన్ని రాజకీయ పార్టీలూ వాగ్దానం చేస్తున్నాయన్నారు. ఓట్ల కోసం, రాజకీయ సభల కోసం మహిళలను ఉపయోగించుకుంటున్నారన్నారు. పార్టీలో పదవులు, ఎన్నికల్లో సీట్లు ఇవ్వడంలో మొండి చేసి చూపిస్తున్నారన్నారు. రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా బిల్లు 12 ఏళ్లుగా పార్లమెంట్ గోడలకు వేలాడుతోందని ఎద్దేవా చేశారు. మహిళలు సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఓటు హక్కు సాధించుకున్నారన్నారు. భారత్‌లో మహిళా సాధికారత కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. ప్రస్తుత లోక్‌సభలో 14.94 శాతం, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో 8.2 శాతం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఒకే ఒక మహిళ గెలుపొందిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలైతే పెక్కు స్థానాల్లో మహిళలు గెలుపు పొందుతారన్నారు. నిర్ణయాధికారాల్లో సమాన భాగస్వామ్యం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.కామేశ్వరి, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక, డి.శారద మహిళా ఉచిత న్యాయ సలహా కేంద్రం కన్వీనర్ కె.అనురాధ, సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.మణి, కుమారి, రంగమ్మ, పుష్ప, భారతి, వి.ప్రభావతి, సిఐటియు నాయకులు బి.జగన్, వి.కృష్ణారావు, టి.నూకరాజు, జి.పోలేశ్వరరావు, జివిఎన్.చలపతి పాల్గొన్నారు.

డి.శారద ట్రస్టు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

మల్కాపురంలో శారద వర్ధంతి సభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ములగాడ : మల్కాపురం సిఐటియు కార్యాలయంలో శారద వర్ధంతి సభ నిర్వహించారు. శారద చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శారద విశాఖ డెయిరీలో ఉద్యోగం చేస్తూ శ్రామిక మహిళల సమస్యలపై పనిచేశారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై శ్రామిక మహిళలు పడుతున్న ఇబ్బందులు, ప్రజాసమస్యలపై పోరాటంలో ఆమె ముందున్నారని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, ఎంఆర్‌కె.జనార్దన్, కార్మికులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక సిఐటియు కార్యాలయంలో శారద చిత్రపటానికి సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, ఎన్.రాజేంద్రప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. శారద ఆశయాలను సాధిద్దామంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లోకేశ్వరరావు, ఐద్వా నాయకులు సంతోషం పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-యస్.రాయవరం: ఇటీవల సంభవించిన మాండూస్ తుఫాన్‌తో అనకాపల్లి జిల్లాలో పంటలు దెబ్బతిన రైతులకు పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణలు డిమాండ్ చేశారు. తిమ్మాపురం సచివాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ తుఫాను కారణంగా రైతులకు చేతికి అందివచ్చిన వరి పంట నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతీ రైతు వరి పంటను పరిశీలించి పంట నష్టం జరిగినా నమోదు చేసి తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరారు. వరి పంట కోసిన పనలు నీటి మునిగిన నష్టం జరిగితే నష్టపరిహారం చెల్లించడానికి అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించడం సరికాదన్నారు. దీంతో రైతులు ఎంతో ఆందోళన చెందుతున్నారని, ఈ నిబంధన రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో వరి పంట కోసిన తరువాత తుఫాన్ ప్రభావానికి నీటి మునిగిన ధాన్యం తడిచి నానిపోయాయన్నారు. అనేక ప్రాంతాల్లో మొలకలు రావడం, రంగు మారడం జరిగిందన్నారు. దీనిని కూడా పరిగణనలోకి తీసుకుని నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రస్తుతం వరి బాగా పండిపోయి కోతలు సమయం దాటి పోవడంతో కోస్తుంటే గింజలు రాలిపోతున్నాయని, ఈ విధంగా కూడా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అనేక ప్రాంతాలలో వరి చేను కింద పడి నీటిలో మునిగిపోయిందని, దీంతో వరి గింజలు రంగు బాగా మారి, మొలకలు కూడా వచ్చాయన్నారు. 33 శాతానికి పైగా పంటకు నష్టం జరిగితేనే నష్టపరిహారం చెల్లిస్తామని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పంట ఏ స్థాయిలో ఎంత నష్టం జరిగినా నమోదు చేసి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. వరి సాగు, కౌలు రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విలేజ్ రెవెన్యూ అధికారి నూకరాజుకి వినతి పత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అధికారుల నిర్లక్ష్యం పై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మామిడి నానాజీ, పిక్కి రాజు, తుమ్మ శంకర్రావు, కురందాసు అప్పలరాజు, మాదాసు విష్ణు, తుమ్మ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పనలతో ఆందోళన చేపడుతున్న అప్పలరాజు, రైతులు

ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

తడి, పొడి చెత్తపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: క్లాప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక అబీద్ సెంటర్ కూడలిలో తడి పొడి చెత్తపై అవగాహన ర్యాలీ శనివారం చేపట్టారు. తడి పొడి చెత్త సేకరణపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలు చెత్తను విచ్చలవిడిగా వీధుల్లో వేయడంతో రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందని వివరించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు ఇంట్లోనే చెత్తను నిల్వ చేసుకొని చెత్త బండి వచ్చినప్పుడు మాత్రమే అందులో వేయాలన్నారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వేయవద్దని తెలిపారు. చెత్త వేయడంతో రోగాల బారిన పాడిన పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు తడి, పొడి చెత్త పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగా ఉండాలన్నారు. ఇళ్లల్లో చెత్తను ఇష్టానుసారంగా రోడ్లపై వేయకుండా మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బందికి మహిళలు సహకరించి వాహనాల దగ్గరికి వచ్చి చెత్త వేయాలన్నారు. శానిటేషన్ కార్యక్రమంపై శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టి బాబు ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కనకారావు, వైసీపీ నాయకులు గొలుసు నరసింహమూర్తి, ఆరుగొల్లు రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న టిడిపి నేతలు

వైసిపిని గద్దెదించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వైసిపి పాలను అంతమొందించాలని టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను పిలుపునిచ్చారు. శనివారం పాములవాక గ్రామంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వేచలపు జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామంలో విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాశీనాయుడు, బికేపల్లి సర్పంచ్ లింగన్ననాయుడు, టిడిపి సీనియర్ నాయకులు భాస్కరరావు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి సమస్య

- ఇంటింటికీ తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి-కోటవురట్ల: బోడపాలెం గ్రామంలో శనివారం రూ.40 లక్షలతో ఇంటింటికి తాగునీటి పథకం కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సింగంపల్లి ఏరుకునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జల జీవన్ మిషన్ ద్వారా బోడపాలెం శివారు కొత్తూరులో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. గ్రామంలో పలు ప్రాంతాలలో ఈ పథకం ద్వారా తాగునీటి సమస్య తీరునున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఏరుకునాయుడు